క్లుప్తంగా

డిప్యూటీ సీఎం పరామర్శ


ఈశ్వరరావును పరామర్శిస్తున్న మంత్రి రాజన్న, తదితరులు

మెంటాడ: మండలంలోని కొంపంగి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు తండ్రి గురుమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బుధవారం గ్రామానికి చేరుకుని ఈశ్వరరావును పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని రాజన్నదొర భరోసా ఇచ్చారు. మంత్రి వెంట ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు


కోమటపల్లి పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటపల్లి, పట్టణంలో గొల్లపల్లిలో గల పెట్రోల్ బంకుల్లో సీఎస్‌డీటీ రెడ్డి సాయకృష్ణ, తదితరులు బుధవారం తనిఖీలు చేపట్టారు. పెట్రోల్ నాణ్యత, కొలతల ప్రకారం ఇస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు.

సాయి నామంతో మార్మోగిన కొమెర


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవిద్యాగణపతి జ్ఞాన సరస్వతి సహిత షిర్డీసాయి మందిర ప్రతిష్ఠోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఖండ్యాం గ్రామానికి చెందిన అంపోలు రుద్ర కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శిష్య బృందం సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశాలతో షిర్డీసాయి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాయి నామస్మరణతో గ్రామం మార్మోగింది. మూడు రోజుల పాటు ప్రతిష్ఠోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

టెంట్లు ఏర్పాటు చేసుకోవాలి


తెర్లాంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద టెంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ అన్నారు. స్థానికంగా జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండల నేపథ్యంలో టెంట్లు వేసుకుంటే సేద తీరేందుకు ఉపయోగపడతాయన్నారు. రెండుపూటలా పని చేస్తే రోజుకు 257 రూపాయల వేతనం లభిస్తుందని చెప్పారు. ఆయన వెంట ఏపీఓ జగదీశ్వరరావు, ఎఫ్ఏ, మేట్లు ఉన్నారు.

చింతాడలో డ్రోన్ సర్వే ప్రారంభం

బొబ్బిలి రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని చింతాడలో బుధవారం డ్రోన్ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి మాట్లాడుతూ, భూ సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకరమంలో సర్పంచ్ బంకురు తిరుపతిరావు, గొంగాడవలస సర్పంచ్ గొంగాడ రామమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి


సమీక్ష నిర్వహిస్తున్న శిక్షణ సంస్థ కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు

బొబ్బిలి రూరల్: ఉపాధి సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఉపాధి శిక్షణ కోర్సు డైరెక్టర్ చిన్నంనాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల వారీగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. లక్ష్యాలు చేరుకోవడంలో సరైన ప్రగతి సాధించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈసీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

అబ్రకదబ్ర...

- ఇంద్రజాలంతో ప్రజలను చైతన్యపరుస్తున్న మెజీషియన్స్
- నేడు పీసీ సర్కార్ జయంతి

బొబ్బిలి రూరల్: చేతి నుంచి విభూతి తీయడం.. నోటిలోనుంచి శివలింగం తీయడం వంటివి తీసేవారిని దైవాంశ సంభూతులుగా భావిస్తుంటారు ప్రజలు. అలాగే చేతబడి, చిల్లంగి పేరుతో హత్యలకు సైతం పాల్పడుతున్న అమాయక ప్రజానీకాన్ని చైతన్యపరుస్తున్నారు ఇంద్రజాలికులు. ప్రముఖ ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ ఫిబ్రవరి 23 1913న జన్మించారు. ఈయన దేశ, విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలిచ్చారు. తన ప్రదర్శనలతో ప్రజలను చైతన్యపరిచి పద్మశ్రీ అవార్డును సైతం అందుకున్నారు. ఈయన జయంతి రోజున ప్రపంచ ఇంద్రజాల దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన పలువురు మెజీషియన్స్ తమ ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ భళా అనిపించుకుంటున్నారు. బొబ్బిలి మండలం అలజంగి సీబీఎం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కె. కృష్ణదాసు (రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత) కేవలం ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించడమే కాకుండా, మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్నారు. సైన్స్ సూత్రాల ఆధారంగా చేసే ఇంద్రజాలాన్ని కొందరు ఎలా దుర్వినియోగం చేసి సొమ్ము చేసుకుంటారో అంతర్గత సూత్రాలు వివరిస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. తలపై టీ కాయడం, చేతిలో కర్పూరం వెలిగించడం, శూన్యం నుంచి వస్తువులు సృష్టించడం, కళ్లకు గంతలు కట్టుకుని వాహనం నడపడం వంటి ప్రదర్శనలు ఇస్తూ వాటి వెనుక ఎటువంటి మహత్యం లేదని, కేవలం సైన్స్ మాత్రమే ఉందని వివరిస్తున్నారు. అలాగే మక్కువ మండలం కన్నంపేట గ్రామానికి చెందిన గుల్లిపల్లి భాస్కరరావు బొబ్బిలి మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన పీసీ సర్కార్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఇంద్రజాలంలో రహస్యాలను తన ప్రదర్శనల అనంతరం వివరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. నీటిని మండించడం, ఖాళీ పాత్రల నుంచి పాలు, పువ్వులు రప్పించడం, గాలి లోనుంచి లడ్డూలు, శివలింగాలు తీయడం వంటి ప్రదర్శనలు చేస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. అలాగే మూఢనమ్మకాలపై జనవిజ్ఞాన వేదిక ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.


నీటి నుంచి మంటలు తెప్పిస్తున్న మెజీషియన్ గుల్లిపల్లి భాస్కరరావు (ఫైల్)

చైతన్యం రావాలి..



గ్రామీణులలో చైతన్యం తీసుకురావడమే నా ధ్యేయం. మూఢనమ్మకాలతో ఎందరో ఇబ్బంది పడుతున్నారు. అలాగే దొంగస్వాములు, బాబాల చేతిలో మోసపోతున్నారు. వీటిని రూపుమాపడమే నా ధ్యేయం.

గుల్లిపల్లి భాస్కరరావు, ఇంద్రజాలికుడు, బొబ్బిలి


చిన్నారి తలపై టీ కాస్తున్న కృష్ణదాసు మస్టారు (ఫైల్)

అవగాహన కల్పించడమే లక్ష్యం....



వెనుకబడిన ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిగా విద్యార్థులలో చైతన్యం నింపడం కనీసం బాధ్యతగా పనిచేస్తున్నాను. తెలిసిన ఇంద్రజాల విద్యతో కొన్ని విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాను.

– కె.కృష్ణదాస్, హెచ్‌ఎం, ఇంద్రజాలికుడు, బొబ్బిలి

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

- గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి చంద్రావతి


విద్యార్థులకు సూచనలిస్తున్న చంద్రావతి

రేగిడి: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులాల సమన్వయాధికారి బి.చంద్రావతి అన్నారు. మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తోందని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల భోజన వసతి, గురుకులం పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, సీనియర్ అధ్యాపకులు కె.నీలాద్రిరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా నవకలశ స్నపనం


కలశ పూజలు చేస్తున్న అర్చకులు

రాజాం సిటీ: స్థానిక పోలిపల్లి పైడితల్లి అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకుని బుధవారం ఆలయ ఆవరణలో నవకలశ స్నపనం పూజలు నిర్వహించారు. నదీ, సముద్ర, కూపం, పుష్కర, చెరువు నీటితోపాటు ఔషధ, సుగంధద్రవ్యాలు, పంచామృతాలతో అమ్మవారికి అభిషకాలు చేశారు. ఏటా జాతరకు ముందు నవకలశ పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణశర్మ, ఆదిత్యశర్మలు తెలిపారు.

కార్యక్రమంలో ఈఓ బీవీ మాధవరావు, ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, సలాది తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం


నాయరాలవలసలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

రేగిడి: రైతులు రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర తదితర పంటలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయరాలవలస, లచ్చన్నవలస, జాడాపేట తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. వీఆర్‌ఓలు అందించిన సర్వే నంబర్ల ఆధారంగా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నామన్నారు. మండలంలో 2,950 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని వెల్లడించారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి

- సీఐ తిరుమలరావు


మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మండలకేంద్రంలో ఈ నెల 27, 28, మార్చి 1 తేదీలలో నిర్వహించనున్న చిన్నమ్మతల్లి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ తిరుమలరావు అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఎస్సై సురేంద్రనాయుడులతో కలిసి మండల కేంద్రంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎవ్వరూ తగాదాలకు పాల్పడవద్దని సూచించారు. అనంతరం ఉత్సవాలను నిర్వహించే ప్రాంతాలను సందర్శించడంతో పాటు గద్దె వద్ద భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ చింతల రామకృష్ణ, దర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

బాడంగి: మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి వి. గోవింద్ తెలిపారు. బుధవారం స్థానిక పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, మండలానికి సుమారు 14 వేల టీకాలు తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాధారణంగా వర్షాకాలంలో ఈ జబ్బు వచ్చే అవకాశం ఉన్నందున పశువులకు టీకాలు వేయించాలని చెప్పారు. ఈ నెలలో సుమారు 12 వేల గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

బాడంగి: రానున్న ఉగాది నాటికి నిర్దేశించిన హౌసింగ్ లక్ష్యాలను పూర్తి చేయాలని హౌసింగ్ డీఈఈ పి. అప్పయ్య మండల గృహనిర్మాణ శాఖాధికారులను ఆదేశించారు. మండలంలోని భీమవరం, ముగడ గ్రామాలలో బుధవారం పర్యటించి, ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ప్రస్తుతానికి 795 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయన్నారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. పరిశీలనలో ఏఈ సత్యం, ఇంజినీరింగ్ సహాయకులు శివనాథ్, లావణ్య, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటనాయుడు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

సంతకవిటి: ప్రతి ఇంటికి జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు అందజేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ డీఈ ప్రభాత్ అన్నారు. మండలంలో తాలాడ, మామిడిపల్లి గ్రామాల్లో జల్‌జీవన్ ద్వారా ఏర్పాటుచేసిన ఇంటి కుళాయిలను బుధవారం ఆయన పరిశీలించారు. తాలాడలో రూ.30 లక్షలు, మామిడిపల్లిలో రూ.36 లక్షలతో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయనతో పాటు క్వాలిటీ కంట్రోల్ జేఈ చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సంతోష్‌కుమార్, తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు ఉన్నారు.

ముగిసిన రామయ్యతండ్రి సంబరాలు

రాజాం: మండలంలో పెనుబాక గ్రామంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన రామయ్యతండ్రి సంబరాలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు వైభవంగా సంబరాలు జరిగాయి. బండి, బింగి, సిమ్మ, అల్లు తదితర కుటుంబాలకు చెందిన వారంతా తమ ఆరాధ్య దైవం శ్రీరాముడికి పూజలు చేశారు. బుధవారం చేపట్టిన పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


సంతకవిటి: జీవామృత తయారీని రైతులకు వివరిస్తున్న మాస్టర్ ట్రైనీ

సంతకవిటి: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులు పొందవచ్చని మాస్టర్ ట్రైనీ ఎస్‌ఎఫ్ శారద అన్నారు. మండలంలోని గోవిందపురం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం తయారీని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రాగోలు పద్మజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సరస్వతి, అప్పలనాయుడులు, ఐసీఆర్‌పీ వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గార్రాజుచీపురుపల్లిలో..

రాజాం: ఆరోగ్యంగా జీవించాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ డి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో గార్రాజుచీపురుపల్లి గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రైతులు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు నారాయణమ్మ, రేఖ, ఐసీఆర్‌పీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ విభాగంలో ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శంకరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, పదో తరగతి ఉత్తీర్ణులైనవారు, ఇంటర్ మధ్యలో మానేసిన వారు అర్హులన్నారు. దరఖాస్తు నమోదుకు రూ. 200, అడ్మినిస్ట్రేషన్ ఫీజు 1400 రూపాయలు చెల్లించి ఈ నెల 27లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు తమ కళాశాలలో లభిస్తాయని తెలిపారు. ఆధార్‌కార్డు, ఫొటో, పదో తరగతి పాస్ లేదా ఇంటర్ డిస్కంటిన్యూ టీసీ సమర్పిస్తే సరిపోతుందన్నారు.

రాజాం/రాజాం సిటీ: ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి, బాలుర కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారితో పాటు ఇంటర్మీడియెట్ మధ్యలో చదువు ఆపేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 27వ తేదీలోగా పదో తరగతి పాస్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, మొబైల్ నంబర్‌తో కళాశాలల్లో సంప్రదించాలని కోరారు. పరీక్ష ఫీజు మార్చి 1 నుంచి 7వ తేదీలోగా విజయనగరం డీవీఈఓకు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ మురళీధరరావు, తదితరులు

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. షిర్డీసాయి మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా వావిలపల్లి రామ్మూర్తినాయుడు మాస్టారు మెమోరియల్ ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ టోర్నీని పాలకొండ సీఐ కె.మురళీధరరావు, వంగర మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు ప్రారంభించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి సుమారు 34 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు 24న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఎం చొరవతో నెరవేరిన సొంతింటి కల


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ, హౌసింగ్ డీఈ

రామభద్రపురం: ముఖ్యమంత్రి జగన్‌బాబుతో మాలాంటి పేదల సొంతింటి కల నెరవేరిందని జగనన్న కాలనీ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ రమామణి, హౌసింగ్ డీఈఈ రత్నాకర్ స్థానిక జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ క్రమంలో యడ్ల వరాలు అనే లబ్ధిదారు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల నుంచి సొంతిళ్లు లేక అవస్థలు పడుతున్న మాలాంటి వారికి జగన్ మోహన్‌రెడ్డి దయ వల్ల ఇళ్లు సమకూరాయని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ, కాలనీల్లో మౌలిక వసతులు కూడా కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ వై. సత్యారావునాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలసంస్కార కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

రాజాం: నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో బాలసంస్కార కేంద్రాల నిర్వహణకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సేవాభారతి రాజాం ఖండ సేవా ప్రముఖ్ శెట్టి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం సమయాలతో పాటు ఆదివారం ఉదయం సమయంలో విద్యార్థులకు ఉచితంగా చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సి ఉంటుంది. ప్రతీ రోజు 2.30 గంటలు ఈ కేంద్రాలు నడపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతీ నెల రూ.1500 గౌరవభృతి, ప్రతీ ఆదివారం విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ 9293727138ను సంప్రదించాలని సూచించారు.

పథకాల అమలులో ముందంజ

- ఎంపీపీ సన్యాసినాయుడు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాయుడు

మెంటాడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో ముందంజలో ఉండాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమించి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని సక్రమంగా అమలు జరిపేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఆదిబాబు, ఎంపీడీఓ త్రివిక్రమ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫలాభిషేకం



రాజాం: మండలంలో మొగిలివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఫలాభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి, నవనాగసహిత బాలసుబ్రహ్మణ్య, కాలభైరవ, చండీశ్వర సహిత కాశీవిశ్వేశ్వర, విశాలక్ష్మి స్పటిక లింగాలకు భక్తులు వివిధ రకాల పండ్లతో అభిషేకాలు చేశారు. శివాలయం ప్రతిష్ఠోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

సంక్షిప్తంగా...

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి


సిద్ధూను అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి, సిబ్బంది

తెర్లాం: రాష్ట్ర స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో రాణించాలని పెరుమాళి హైస్కూల్ హెచ్‌ఎం శ్రీదేవి ఆకాంక్షించారు. ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలో పాఠశాలకు చెందిన విద్యార్థి ఆర్.సిద్ధూ ప్రదర్శించిన రోడ్డు ప్రమాదాల నివారణ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణించి పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగించొద్దు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాజాం: నిషేధిత ప్లాస్టిక్ సంచులు, కవర్లను వినియోగించొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పట్టణ ప్రజలకు సూచించారు. శ్రీనివాస మార్కెట్ రోడ్డు, రైతు బజారులలో దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చిరంచారు. కూరగాయలు, కిరణా సామాగ్రి కొనుగోలుచేస్తున్న వినియోగదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పర్యావరణ కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఉపాధి పనులకు ఆసక్తి

రేగిడి: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులకు వేతనదారులు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా చక్కగా పనులు చేస్తున్నారు. ప్రభుత్వం రోజుకు రూ.257లు వేతనం ఇస్తుండడంతో వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే చక్కగా ఉపాధి పనులు చేసుకుంటున్నారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో 4,500 మంది వేతనదారులు ఉపాధి పనులు చేస్తున్నారని ఏపీఓ ఎస్. హరనాథ్ తెలిపారు.

ఆర్‌బీకే సేవలపై ఆరా

రాజాం: రైతు భరోసా కేంద్రాల సేవలు రైతులకు అందుబాటులో ఉండాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మండలంలో కంచరాం, బొద్దాం, అంతకాపల్లి తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వివరాలను వీపీఏలను అడిగి తెలుసుకున్నారు. రైతుల్లో సాగు విజ్ఞానం పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏఓ రేణుకాసాయి ఉన్నారు.

మందుల పంపిణీపై హర్షం


మెంటాడ ఎస్సీ కాలనీలో మందుల పంపిణీపై ఆరా తీస్తున్న కేంద్ర వైద్య బృందం

మెంటాడ : బోదవ్యాధి నివారణ మందులు పంపిణీపై కేంద్ర ఆరోగ్య వైద్య బృందం సిబ్బంది జయిరాం, నితిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. మెంటాడ మండల కేంద్రంలో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి బోధ నివారణకు బుధవారం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంఓ తులసి, ఏఎంఓ డీపీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ దినోత్సవం


విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

వంగర: స్థానిక వివేక మాస్టర్ మైండ్స్ హైస్కూల్‌లో వరల్డ్ స్కౌట్స్ డే బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, స్కౌట్ ఉపాధ్యాయులు సంతోష్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు.

ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలి

రేగిడి: సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, వాటిలో పనిచేస్తున్న ఉద్యోగులు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు సూచించారు. మండలంలోని అంబకండి-1, 2 గ్రామ సచివాలయాను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు. అర్హులు పథకాల కోసం సచివాలయానికి వస్తే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ


కమిషనర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావును ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం రాత్రి పరామర్శించారు. ఇటీవల కమిషనర్‌కు కంటి సంబంధిత శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకుని ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకుని విధులు సక్రమంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్‌కుమార్, కరణం సుదర్శనరావు, పాలవలస గోపి, శెట్టి తవుడు తదితరులు ఉన్నారు.